# భారీగా విదేశీ మద్యం పట్టివేత

- రూ.14లక్షల విలువ చేసే 60లీటర్ల విదేశీ మద్యం, బస్సు, ద్విచక్ర వాహనం సీజ్
- ముగ్గురు నిందితులు అరెస్ట్



అక్రమంగా రవాణా చేసిన విదేశీ మద్యాన్ని పట్టుకున్న హైదరాబాద్ జిల్లా డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కంచర్ల కరుణారెడ్డి బృందం

సిటీబ్యూరో, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ): ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా చెన్నై నుంచి నగరానికి విదేశీ మద్యం రవాణా చేస్తున్న ముగ్గురు నిందితులను హైదరాబాద్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్(డీటీఎఫ్)అధికారులు పట్టుకున్నారు. నిందితుల వద్ద నుంచి రూ.14లక్షల విలువ జేసే 60 విదేశీ మద్యం బాటిళ్లు, రవాణాకు వినియోగించిన ప్రైవేటు బస్సు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. వివరాల్లోకి వెళితే.. చెన్నై నుంచి నగరానికి వస్తున్న ఓ ప్రైవేటు బస్సులో పెద్దఎత్తున విదేశీ మద్యం తరలిస్తున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు హైదరాబాద్ జిల్లా డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కంచర్ల కరుణారెడ్డి తన బృందంతో కలిసి నాంపల్లి మెట్రో స్టేషన్ వద్ద సదరు బస్సును ఆపి తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లోలో భాగంగా బస్సు డిక్కీ తెరిచి చూడగా.. 60 విదేశీ మద్యం బాటిళ్లు బయటపడ్డాయి. దీంతో బస్సు డ్రైవర్ ఇస్టమ్‌శెట్టి వెంకటరావు, అదనపు డ్రైవర్ పుట్ట మణికంఠను అదుపులోకి తీసుకుని విచారించగా.. చెన్నైకి చెందిన సతీశ్ అనే వ్యక్తి విదేశీ మద్యాన్ని అందజేశాడని, ఈ మద్యాన్ని నగరంలోని వెంకటాపురం శేషసాయికి అప్పగించాలని సూచించినట్లు వెల్లడించారు. అంతలోనే మద్యం తీసుకునేందుకు ద్విచక్ర వాహనంపై నాంపల్లికి వచ్చిన శేషసాయిని కూడా ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.14లక్షల విలువైన 60 విదేశీ మద్యం బాటిళ్లతోపాటు ప్రైవేటు బస్సు, ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. తదుపరి విచారణ నిమిత్తం కేసును నాంపల్లి ఎక్సైజ్ అధికారులకు అప్పగించారు. హైదరాబాద్ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ సీహెచ్.విజయ్ ఆదేశాల మేరకు జరిపిన ఈ దాడుల్లో డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కె.కరుణారెడ్డి, ఎస్ఐలు ఉమారాణి, సంపత్‌కుమార్, కానిస్టేబుళ్లు జనార్దన్‌రెడ్డి, రాజు, వీరేందర్‌సింగ్ పాల్గొన్నారు.

– మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల వ్యయ పరిశీలకులతో శనివారం రాచకొండ కమిషనరేట్ ఆధ్వర్యంలో పోలీసు, అధికార యంత్రాంగం ఉన్నతస్థాయి సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. రాచకొండ, సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌లు డీఎస్ చౌహాన్, స్టీఫెన్ రవీంద్ర జాయింట్ కమిషనర్‌లు తరుణ్ జోషి, అవినాష్ మహంతి, రంగారెడ్డి.. మేడ్చల్ జిల్లా కలెక్టర్‌లు భారతి, గౌతమ్ పొట్రు, ఎన్నికల పర్యవేక్షకులు ప్రేమ్‌ప్రకాశ్ మీనా, ప్రయ రంజన్ శ్రీవాస్తవ, శంకర్ గుప్త, వినోద్ కుమార్.. ఎక్సైజ్ శాఖ జీఎస్టీ, ఐటీశాఖల అధికారులతో సమన్వయ సమావేశంలో నిర్వహించి తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. అక్రమంగా తరలిస్తున్న నగదు, మద్యాన్ని జిల్లా మెజిస్ట్రేట్ సమక్షంలో సీజ్ చేయించాలని సూచించారు.

## ‘డుంజో’ యాప్‌లో దగా

- వస్త్రాల కొనుగోలు పేరిట మోసం

వెంగళరావునగర్, నవంబర్ 4 : వస్త్రాలు కావాలని ఆన్‌లైన్‌లో వచ్చిన ఆర్డర్‌కు డెలివరీ పేరిట సరుకుతో ఉడాయించిన సంఘటనపై మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మధురానగర్‌లోని ఓ ఇంట్లో కార్తిక్ వదవతి అనే వ్యక్తి బోటిక్ నడుపుతున్నాడు. వస్త్రాల స్టాక్ ఉంచి ఆర్డర్లకు సప్లయ్ చేస్తుంటారు. డుంజో డిజిటల్ ప్రైవేట్ లిమిటెడ్ యాప్ ద్వారా గత నెల 30వ తేదీ మధ్యాహ్నం కొండాపూర్ నుంచి ఓ కస్టమర్ రూ.25వేలు విలువ చేసే వస్త్రాలకు ఆర్డర్ ఇచ్చారు. సుళ్లూరు మహేశ్, ప్రవీణ్‌కుమార్‌లనే ఇద్దరు డెలివరీ బాయ్స్ మధురానగర్‌కు వచ్చి రూ.25వేలు విలువ చేసే వస్త్రాలను డెలివరీ కోసం తీసుకెళ్లారు. ఆ తర్వాత ఆ ఆర్డర్ క్యాన్సిల్ అయింది. అలా బట్టలు డెలివరీ పేరిట తీసుకెళ్లిన సుళ్లూరు మహేశ్, ప్రవీణ్‌కుమార్ క్యాన్సిల్ అయినప్పటికీ.. ఆ సరుకును తిరిగి తెచ్చివ్వలేదు. ఆ తర్వాత డెలివరీ బాయ్స్ ఇద్దరూ తమ ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసుకున్నారు. దాంతో తాను మోసపోయామని గ్రహించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## యువతిపై కత్తితో దాడి..

- తాను గాయపర్చుకున్న యువకుడు

చర్లపల్లి, నవంబర్ 4 : ఓ యువతిపై యువకుడు కత్తితో దాడి చేసి తాను గాయపర్చుకున్న సంఘటన కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. కుషాయిగూడ పోలీసుల కథనం ప్రకారం.. ఏఎస్‌రావునగర్ డివిజన్ డీఏఈ కాలనీకి చెందిన మెరుగు వన్ష్(21), మౌలాలికి ఎంజే కాలనీకి చెందిన ఓ యువతి(21) ఇద్దరు చిన్ననాటి స్నేహితులు. వీరువురు ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంజినీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్నారు. కాగా, వీరువురు గత కొంత కాలంగా ప్రేమించుకుంటుండగా.. యువతి ఇటీవల ప్రేమకు నిరాకరించింది. దీంతో మెరుగు వన్ష్ మాట్లాకుందామని డీఏఈ కాలనీకి పిలిపించుకొని తన కారులో మాట్లాడుతుండగా.. ఒక్కసారిగా కోపంతో యువతిపై దాడి చేసి మెడ, పొట్టపై గాయపర్చి తాను కూడా కత్తితో మెడపై పొడుచుకున్నాడు. దీంతో స్థానికులు, కాలనీలోని సీఐఎస్ఎఫ్ పోలీసులు గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించగా.. పోలీసులు వైద్యశాలకు తరలించారు. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## రూ.3కోట్ల విలువైన మద్యం స్వాధీనం

- 23 మంది అరెస్ట్



సమావేశంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవీందర్‌రావు, సీఐ శ్రీనివాస్‌రావు

ఆర్కేపురం, నవంబర్ 4 : తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చినప్పటి నుంచి దాదాపు రూ.3కోట్ల విలువైన అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకొని 88 కేసులు నమోదు చేసి 23 మందిని అరెస్టు చేశామని సరూర్‌నగర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవీందర్‌రావు తెలిపారు. శనివారం ఆర్కేపురంలోని సరూర్‌నగర్ ఎక్సైజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సరూర్‌నగర్ ఎక్సైజ్ పరిధిలోని ఐదు నియోజకవర్గాలైన ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, ఆమనగల్, షాద్‌నగర్, ఎల్బీనగర్ ప్రాంతాల్లో ఎన్నికల నియమావళి ప్రకారం 24 గంటలు రెండు టీములు గస్తీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గంజాయి, డ్రగ్స్, అక్రమ మద్యం వంటిపై నిఘా పెట్టామని, దాదాపు 84,440 లీటర్ల మద్యం, 75 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని, వీటి విలువ రూ.3 కోట్లు ఉంటుందన్నారు. సుంకం చెల్లించని మద్యం, అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం, గంజాయి లాంటి మత్తు పదార్థాల సమాచారం తెలిస్తే కమిషనర్ కార్యాలయానికి గాని, టోల్ ఫ్రీ నం.18004252523 సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్, సరూర్‌నగర్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాస్‌రావు, ఎక్సైజ్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

### బాలానగర్‌లో రూ.5 లక్షలు పట్టివేత

బాలానగర్, నవంబర్ 4 : బాలానగర్ నర్సాపూర్ చౌరస్తాలో శనివారం వాహనాల తనిఖీ చేస్తున్న సమయంలో యాక్టివా వాహనంలో ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.5 లక్షలు పట్టుబడ్డాయి. నగదుకు సంబంధించిన ఏదైనా డాక్యుమెంట్లు చూపించి నగదును తీసుకుపోవచ్చని సీఐ భాస్కర్ తెలిపారు.


## కల్లు దుకాణాలపై దాడులు ఆపాలి

- తెలంగాణ గౌడ సంఘం అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్‌రావుగౌడ్

సిటీబ్యూరో, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ): నగరంలోని కల్లు దుకాణాలపై ఆకస్మిక దాడులను తక్షణమే ఆపాలని తెలంగాణ గౌడ సంఘం అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్‌రావుగౌడ్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్, రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్, నగర కమిషనర్ సందీప్ శాండిల్యలను కలిసి శనివారం వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పల్లె లక్ష్మణ్‌రావుగౌడ్ మాట్లాడుతూ.. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో ఆధ్వర్యంలో నగర పోలీసులు, సీఆర్‌పీఎఫ్ బృందాలతో కల్లు దుకాణాలపై దాడులు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. తెలంగాణ ఏర్పడిన 10 ఏండ్ల నుంచి ప్రశాంతంగా దుకాణాలు నడుపుకున్న గౌడ్స్.. ఈ దాడులతో ఆందోళన చెందుతున్నారని చెప్పారు. 70 ఏండ్ల పైబడిన సొసైటీ యజమానులను రిమాండ్‌కు పంపిస్తున్నారని, వారికేమైనా జరిగితే ఎవరిది బాధ్యతని ఆయన ప్రశ్నించారు. జరగరానిది ఏమైనా జరిగితే లక్ష మందితో నగరంలో ధర్నా చేపడుతామని హెచ్చరించారు. తక్షణమే దాడులను ఆపేయాలని కోరారు.

## హషీష్ ఆయిల్ పట్టివేత.. వ్యక్తి అరెస్ట్

- 410 ఎంఎల్ ఆయిల్ స్వాధీనం



సిటీబ్యూరో, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ)/బంజారాహిల్స్ : మత్తు పదార్థాలు విక్రయిస్తున్న వ్యక్తిని యాంటి నార్కోటిక్ బ్యూరో(టీ–న్యాబ్) పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి రూ.3లక్షల విలువ చేసే 485 మి.లీటర్ల హషీష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే... గుంటూరు పెద్దకాకాని ప్రాంతానికి చెందిన రెడ్డిబత్తుల జగదీశ్ రెడ్డి గత ఏడాది కాలంగా మత్తు పదార్థాలు విక్రయిస్తున్నాడు. ఏపీలోని అల్లూరు సీతారామరాజు జిల్లా నుంచి పరిచయం ఉన్న వ్యక్తుల ద్వారా వివిధ రకాల మత్తు పదార్థాలను తక్కువ ధరకు కొనుగోలు చేసి, నగరంలో అధిక ధరలకు విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం జూబ్లీహిల్స్‌లో హషీష్ ఆయిల్‌ను విక్రయించేందుకు యత్నిస్తుండగా.. సమాచారం అందుకున్న టీ–న్యాబ్ పోలీసులు నిందితుడిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి రూ.3లక్షల విలువ చేసే 5ఎం.ఎల్‌తో కూడిన 85 హషీష్ ఆయిల్ బాటిల్స్(485ఎం.ఎల్)ను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. తదుపరి విచారణ నిమిత్తం కేసును జూబ్లీహిల్స్ పోలీసులకు అప్పగించారు.

## క్రషర్‌లో పడి ఇద్దరు కార్మికుల దుర్మరణం

- నుజ్జునుజ్జైయిన మృతదేహాలు
- బయటకు పొక్కనీయకుండా యత్నించిన యాజమాన్యం
- పుప్పాలగూడలో ఘటన.. కేసు దర్యాప్తు చేపట్టిన నార్సింగి పోలీసులు

మణికొండ, నవంబర్ 4 : నగర శివారు ప్రాంతంలోని పుప్పాలగూడ ఏఎస్‌బీఎల్ నిర్మాణ రంగ సంస్థ రెడీమిక్స్ మిక్సర్‌లో ప్రమాదవశాత్తు పడి ఇద్దరు కార్మికులు దుర్మరణం చెందిన సంఘటన శనివారం నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పూర్తి వివరాలలోకి వెళితే.. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని పుప్పాలగూడ క్రైస్ విల్లా సముదాయాల సమీపంలోని ఏఎస్‌బీఎల్ నిర్మాణ రంగ సంస్థకు చెందిన రెడీమిక్స్ మిక్సర్‌లో క్లీనింగ్ చేస్తుండగా విషయం తెలుసుకోలేని ఆపరేటర్ మిషన్‌ను ఆన్ చేశాడు. దీంతో ఒక్కసారిగా మిషన్‌లో కూరుకుపోయి బేటా సోరెన్(22), సుశీల్ ముర్ము(20) అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. ఈ విషయాన్ని బయటకు పొక్కనీయకుండా నిర్మాణ సంస్థ యాజమాన్యం నుజ్జునుజ్జైయిన మృతదేహాలను బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు. దీంతో విషయం తెలుసుకుని మృతుల కుటుంబసభ్యులు, బంధువులు పుప్పాలగూడలోని రెడీమిక్స్ ప్లాంటు వద్దకు చేరుకుని ఆఫీసును ధ్వంసం చేసి ఆందోళనకు దిగారు. వెంటనే నార్సింగి పోలీసులు అక్కడకు చేరుకుని యాజమాన్యం తీరుపై చర్యలకు ఉపక్రమించారు. రెండు నిండు ప్రాణాలను బలిగొన్న యాజమాన్యంపై కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ఉస్మానియా మార్చురీకి తరలించారు.

## రాజీ చేసుకునేందుకు సువర్ణావకాశం

- డిసెంబర్ 9న జాతీయ లోక్ అదాలత్

నాంపల్లి కోర్టులు, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ) : సమయాన్ని, డబ్బును ఆదా చేసుకుని కేసులను రాజీ చేసుకుని జాతీయ లోక్‌అదాలత్‌లో తొలగించుకునేందుకు సువర్ణావకాశం. వచ్చే నెల 9వ తేదీన జరగనున్న లోక్ అదాలత్‌లో కేసులను కొట్టివేసుకునే అవకాశాన్ని కల్పిస్తున్నది. ఇరు వర్గాలకు చెందిన కక్షిదారులు రాజీ చేసుకునేందుకు వీలున్న సెక్షన్ల కేసులన్నింటిని తొలగించేందుకు ఉపయుక్తంగా ఉంటుంది. చెక్ బౌన్స్, ఎక్సైజ్, వివాహ సంబంధ, ఐపీఎస్ సెక్షన్ల కింద నమోదైన కేసులను రాజీ చేసుకోవచ్చు. కక్షిదారులకు ఇబ్బందులు లేకుండా నాంపల్లి కోర్టుల న్యాయసేవాధికార సంస్థ చర్యలు చేపట్టింది. పోలీసు అధికారులు, న్యాయవాదులు, మెజిస్ట్రేట్లు కక్షిదారులను ప్రోత్సహించేందుకు సమాయత్తమవుతున్నారు. ఏండ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరగవలసిన అవసరం లేదు.

## వైద్యురాలికే వైద్యం వికటించింది..

- నెలసరి సమస్యపై ఆసుపత్రికి వెళ్తే.. ఒళ్లంతా మంటలు
- తప్పును కప్పిపుచ్చేందుకు ఓ హాస్పిటల్ వైద్యురాలు యత్నం
- పోలీసులకు ఫిర్యాదు.. కేసు నమోదు చేసిన మధురానగర్ పోలీసులు

వెంగళరావునగర్, నవంబర్ 4 : వైద్యురాలికే వైద్యం వికటించింది.. డాక్టరమ్మనే మరో డాక్టరమ్మ వచ్చిరాని వైద్యంతో పేషంట్‌గా మార్చింది. నెలసరి సమస్యకు చికిత్స కోసం వెళ్లిన వైద్యురాల్ని మరో వైద్యురాలు నిర్లక్ష్యపు చికిత్స చేసింది. ఫలితంగా ఆ డాక్టరమ్మకు ఒళ్లంతా మంటలతో బొబ్బలు వచ్చాయి. చేసిన నిర్లక్ష్యపు వైద్యాన్ని, తప్పును కప్పిపుచ్చుకునేందుకు యత్నించిన వైద్యురాలిపై బాధిత వైద్యురాలు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12లో నివాసముండే వైద్యురాలు(43) బాచుపల్లిలోని ఓ మెడికల్ కాలేజీలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తుంటారు. అయితే ఈ వైద్యురాలికి నెలసరి సమయంలో అధిక రక్తస్రావం కావడంతో చికిత్స నిమిత్తం యూసుఫ్‌గూడలోని ఓ ఆసుపత్రికి వెళ్లారు. పరీక్షించిన దవాఖాన డైరెక్టర్, డాక్టర్ ఫహ్మీదాభాను ఫైబ్రాయిడ్ అండ్ అంబ్లాకిల్ హెర్నియా వ్యాధిగా నిర్ధారించి గత సెప్టెంబర్ 19వ తేదీన రోగికి చికిత్స చేశారు. ఆ మరుసటి రోజు నుంచి రోగికి ఒళ్లంతా మంటలు, కాలిన బొబ్బల్లా ఏర్పడ్డాయి. ఆ పుండ్లను ఓ హాస్పిటల్‌లోని వైద్యులకు చూపించగా.. ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ కిన్నెరరెడ్డితో మరోమారు చికిత్స చేయించారు. డ్రగ్ ఇన్‌ఫెక్షన్ కారణంగా ఇలా జరిగిందని డాక్టర్ కిన్నెరరెడ్డి చెప్పారు. బాధితురాలు మరో ఆసుపత్రికి వెళ్లి చూపించుకున్నారు. దీంతో డాక్టర్ ఫహ్మీదాభాను, ప్లాస్టిక్ సర్జన్ కిన్నెరరెడ్డిలపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్.ఐ ఇక్బాల్ హుస్సేన్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.